


# ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్లో ఓ పాసెంజర్

'హితశ్రీ'

మద్రాస్ వెళ్ళే సర్కార్ ఎక్స్‌ప్రెస్ చీకట్లు చీల్చుకుంటూ మరో మజిలీ చేరింది. రామచంద్ర చదువుతున్న పత్రికనుంచి దృష్టిమరల్చి కిటికీలోంచి చూసాడు. జనం హడావిడిగా పరిగెడుతున్నారు. తను సురక్షితంగా, హాయిగా స్లీపర్‌కోచ్‌లో బెర్త్ ఆక్రమించుకుని కూర్చున్నాడు. ఎంతోమంది స్థలంకోసం ఆరాటపడుతూ అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు. పత్రిక పక్కన పడేసి రామచంద్ర డోర్‌దగ్గరికి వచ్చాడు. బెర్త్‌కోసం, కనీసం సీటుకోసం కొందరు కండక్టర్‌ని ప్రాధేయపడుతూ అడుగుతున్నారు. ఖాళీ లేమీ లేవని ఆయన నిక్కచ్చిగా చెప్పేస్తున్నాడు. కొంచెం చొరవగా జబర్దస్తీగా కంపార్ట్‌మెంట్‌లోకి జొరబడబోతున్న ఘరానా ప్రయాణికుల్ని అధికారిక కాఠిన్యంతో నెట్టేస్తూ కండక్టర్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి డోర్ వెయ్యబోతున్నాడు. ఇంతలో ఆదరాబాదరాగా ఒక ముసలాయన, ఒక ముసలామె వగరుస్తూ వచ్చారు.

"సార్, రిజర్వేషన్ ఉందండీ–

"ఎం. సీతారామయ్య" ముసలాయన రిజర్వేషన్ టికెట్ చూపిస్తూ ఆయాస పడుతూ అన్నాడు. కండక్టర్ చార్ట్ చూసి "ఎక్కండి" అన్నాడు. పోర్టర్ కంపార్ట్ మెంట్‌లోకి పెట్టె, బెడ్డింగ్ తీసుకొని వెళుతుండగా ముసలాయన ముసలామె ఇద్దరూ అతనివెంట కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు.

"సార్— ఇంకో బెర్త్‌గాని, సీట్‌గాని ఇప్పించండి."

"లేదు."

"అలా కాదు సార్. అర్జంట్‌గా వెళ్ళాలండి. ఈమె నా భార్యండి. నాకు హార్ట్ ఎన్లార్జ్‌మెంట్ ఉందండి. మా అబ్బాయి హాస్పిటల్లో చూపిస్తాను, రమ్మనిరాస్తే మద్రాస్ వెడుతున్నానండి. ఆర్థిక పరిస్థితులవల్ల మొదట ఒక్కడినే వెడదామనుకుని ఒక్కటే బెర్త్ రిజర్వ్ చేసుకొన్నామండి. ఇప్పుడు ఈమె వస్తానని పట్టుబడుతోంది. ఎలాగైనా తమరు ఒక సీటైనా ఇప్పించాలి. ఇంకెక్కడో ఎక్కి ప్రయాణంచేసే సమర్థురాలు కాదు."

"కాస్త దయుంచి పుణ్యంకట్టుకోండి బాబూ, నేను దగ్గరుండకపోతే ఆయనకి మందుమాకూ సరిగా జరగదు."

కండక్టర్ తల అడ్డంగా తిప్పుతూ "క్షమించండి, నే నేంచెయ్యలేను. మీరు దిగండి" అన్నాడు.

"చూశావా, ఒద్దంటే వినకుండా ప్రయణమయావు" అన్నాడు ముసలాయన నిష్ఠురంగా.

"పోనీలెండి, పక్క పెట్టెలో సర్దుకుంటాను" అందామె నిస్సహాయంగా.

"రైలంతా కిటకిటలాడిపోతోంది. నా మాట విను. నువ్వు అవస్థపడలేవు. వీలుంటే తర్వాత రావచ్చు. నేను ఉత్తరం రాస్తాగా. దిగి వెళ్ళిపో. ఇదిగో, నీ టికెట్ వాపసు ఇస్తే కొంత మినహాయించుకొని డబ్బిస్తారు. జాగ్రత్త. నీ బాగ్ తీసుకో."

ఆమె తటపటాయిస్తూ నిలబడింది. కండక్టర్ తొందరచేస్తూ "దిగండమ్మా టైమవుతుంది" అన్నాడు.

"పక్కన ఎక్కడన్నా ఎక్కుతానండీ" అందామె జాలిగా.

"నీ ఆరోగ్యం అసలే అంతంత మాత్రం. మద్రాస్‌దాకా నిలబడి ప్రయాణం చేస్తే కళ్ళు తిరిగి పడిపోతావు. నా మాట విను" అన్నాడు ముసలాయన. ఆ ముసలామెకి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"దిగాలండీ—" అన్నాడు కండక్టర్.

"వెళ్తున్నానండీ." అందామె దిగులుగా ముసలాయన వైపు చూస్తూ.

ఆ దృశ్యంచూస్తూ, ఆ మాటలు వింటున్న రామచంద్రలో యువత పెల్లుబికింది.

"అక్కర్లేదమ్మా నా బెర్త్ మీకిస్తాను. కండక్టర్‌గారూ! నా బెర్త్ వీరికి అలాట్ చేయండి. నేను ఇంకో కంపార్ట్‌మెంట్‌లోకి పోతాను."

ముసలాయన, ముసలామె, కండక్టరు అప్రతిభులయారు. రామచంద్ర చప్పున తన బెర్త్‌దగ్గరికి వెళ్ళి బ్రీఫ్‌కేస్ తీసుకొని పత్రికలు మడిచిపట్టుకొని డోర్‌దగ్గరికి వచ్చాడు.

ముసలాయన నమ్మలేనట్టుగా అతని వైపు చూస్తూ అన్నాడు. "అదేమిటి బాబూ. మాకోసం మీరు అవస్థపడతారా."

"అవస్థేముందండీ? నేను కుర్రతనంలో ఉన్నాను. ఢిల్లీ దాకా కూడా నిలబడి ప్రయాణంచేసే జవసత్వాలూ ఉత్సాహమూ నా కున్నాయి. వస్తానండీ."

కంపార్ట్‌మెంట్ దిగిపోతున్న ఆ యువకుడివైపు ఆప్యాయంగా చూస్తూ "వెయ్యేళ్ళు బతుకు నాయనా" అందామె, వరమిస్తున్న మహాలక్ష్మిలా.

రైలు కదలబోతుండగా రామచంద్ర అందుబాటులో ఉన్న ఓ పెట్టెలో ఎక్కాడు. అది జనంతో కిటకిటలాడి పోతోంది. లోపలికి ప్రవేశించటమే ఓ బ్రహ్మప్రయత్నమైంది. ఎలాగో చోటు చేసుకొని లోపలికి జొరబడ్డాడు. డోర్ దగ్గర మరీ తొక్కిడిగా ఉంటే కొంచెం ముందుకి తోసుకొని వెళ్ళి రెండు బెర్త్‌లమధ్య నిలబడ్డాడు. ఆ పెట్టెలో సగానికి పైగా స్త్రీలున్నారని అతను గమనించాడు. 'ఈ చిన్న కంపార్ట్ మెంట్‌లో మొత్తం భారతదేశమే చిన్న సైజులో కుదించబడి ఆవిష్కృతమైందా.' అనుకున్నాడు రామచంద్ర. ఆ జనంలో రకరకాల అంతస్తుల్ని, రకరకాల వయసుల్ని, రకరకాల ధోరణుల్ని ఆశ్చర్యంగా గమనించసాగాడు. అతను నిలబడ్డ స్థలంలో బెర్తులమీద, సామన్లు పెట్టే బల్లలమీద, బెర్తులమధ్య నడవలో కూడా అంగుళం స్థలంలేకుండా జనం కూర్చునో, నించునో ఆక్రమణ జరిపారు. ఓ మూల కొందరు జోరుగా చీట్లపేక ఆడుతున్నారు. కొందరు నిద్రలో తూలుతున్నారు. కొందరు తీవ్రంగా చర్చిస్తున్నారు. కొందరు కూనిరాగాలు తీస్తున్నారు. రామచంద్రకి ఎదురుగా ఉన్న బెర్త్‌మీద ఓ నడివయసులో ఉన్న స్త్రీ, ఓ వయసులో ఉన్న అమ్మాయి, వయసుముదిరిన స్త్రీలిద్దరూ ఉన్నారు. ఆ పక్కన ఓ బైరాగి తనలోకంలో తను ఉన్నాడు. బైరాగిని వింతగా చూస్తూ తమలో తాము ఏదో ఛెణుకులు విసురుకుంటూ అతనికి ఎదురుగా ముగ్గురు యువకులు కూర్చున్నారు. వారిపక్కన షావుకారు అనదగిన ఓ వ్యక్తి, ఓ చిన్న కుర్రాడు, ఓ పల్లెటూరి ఆసామీ, గుమస్తా వాలకం ఉన్న ఓ వ్యక్తి ఉన్నారు. రామచంద్ర పరిశీలనాశీలి. వీరందర్నీ చూస్తూ, వీరి మాటలు వింటూ అతనేవో ఆలోచనల్లో పడ్డాడు.

"టికెట్ టికెట్."

టి. టి. ఇ. రెట్టించి అడిగేసరికి రామచంద్ర ఆలోచనల్లోంచి ఊడిపడ్డాడు. టికెట్ తీసి చూపిస్తూ "ఈ రద్దీలో ఇదొకటా!" అనుకున్నాడు. ఓసారి బ్రీఫ్‌కేస్ ఉందోలేదో చూసుకున్నాడు. అది పదిలంగా సామన్ల బల్లమీద ఉన్నానంటూ కనిపించేసరికి 'అమ్మయ్య-' అనుకున్నాడు. ప్రస్తుతం అది ప్రాణంతో సమానం. అందులో తన అర్హతలు చూపే సర్టిఫికెట్లు ఒరిజినల్స్ ఉన్నాయి. రామచంద్రకి కొంచెం భయం వేసింది. ఆ బ్రీఫ్‌కేస్ ఎవరైనా కొట్టేస్తే! ఇక ఇంటర్వ్యూ లేదు. ఉద్యోగం లేదు. రిజర్వ్‌బాంక్ వాళ్ళు స్పష్టంగా రాశారు. ఇంటర్వ్యూకి ఒరిజినల్స్ దాఖలుచెయ్యాలి. లేకపోతే ఎట్టిపరిస్థితుల్లోను ఇంటర్వ్యూకి అనుమతి ఇవ్వబడదు. తనకి రిటెన్ టెస్ట్‌లో మంచి రాంక్ వచ్చిందని అనధికారంగా తెలిసింది. చప్పున రామచంద్రకి నవ్వొచ్చింది. అనుకోకుండా బైరాగివంక చూశాడు. తరతరాల భారతీయ తాత్త్విక సంప్రదాయలకి వారసుడా? అగాధమైన దారిద్ర్యానికి ప్రతీకా? అంధ విశ్వాసంలో గమ్యంలేని ప్రయాణించేసే పాంధుడా? ప్రపంచం నించి పారిపోయే పిరికివాడా! ప్రజల్ని మభ్యపెట్టే మోసగాడా? వట్టి భిక్షుకుడా? గంజాయి దమ్ములాగుతూ తుపాకి గొట్టం నించి చిలుముగొట్టానికి ప్రజల్ని ఆకర్షించే 'ఆనందో బ్రహ్మ' మార్గానుయాయా? వట్టి జోగా! అసలు అతని దగ్గిర టికెట్ ఉందా! రామచంద్ర సందేహం వెంటనే తీరిపోయింది. టి. టి. ఇ. అడగ్గానే ఆ బైరాగి టికెట్ తీసి చూపించాడు. కండక్టర్ కూడా ఆశ్చర్యపోయి ఓ క్షణం బైరాగి వంక చూశాడు.

"తమరెందాకా?" అనుకోని మర్యాద ఉట్టిపడేట్టు అడిగాడు రామచంద్ర.

బైరాగి అతని వైపు కళ్ళెత్తి చూశాడు.

"రామేశ్వరం నాయనా."

రామేశ్వరందాకా ఈయనకి టికెట్ ఏ ధర్మాత్ముడు కొనిచ్చాడో! ఎందుకివ్వరు? మనది ధార్మిక దేశం. కాదు, ఆధ్యాత్మిక దేశం. తెలియనిదేదో ఉన్నదనుకుని ఆ భ్రాంతిలో బతికే ప్రజల దేశం. అయితే ఆ బైరాగి కళ్ళలో ఏదో కాంతి లేకపోలేదు. అదేమిటో!

"టికెట్."

"లేదండీ."

చెంప ఛెళ్ళుమంది. రామచంద్ర ఉలిక్కిపడి చూశాడు.

"రాస్కెల్. రైలు నీ అబ్బగాడి సొమ్మనుకున్నావా? నీ క్కావలసింది రైలు కాదురా, జైలు. పక్క స్టేషన్‌లో పోలీసులకి అప్పచెబుతా. రోగం కుదుర్తుంది!"

పదేళ్ళుంటాయేమో, పాపం, ఆ కుర్రాడు గుడ్ల నీరు కుక్కుకుంటూ చొక్కాతో కళ్ళు తుడుచుకుంటున్నాడు. రామచంద్రకి జాలేసింది.

"ఎక్కడికి వెడుతున్నావు అబ్బాయ్?"

"నెల్లూరండి."

"ఎవరున్నారు అక్కడ."

"మా అమ్మండి."

"మరి టిక్కెట్ ఎందుకు కొనలేదు?"

"డబ్బుల్లేవండి."

"లేవా? ఎందుకు లేవు? అంటే చెప్పకుండా వస్తున్నావా?"

అవునన్నట్టు ఆ కుర్రాడు తలూపాడు.

"ఎందువల్ల? అసలెక్కడినించి వస్తున్నావు?"

"గుంటూరు నించండి. మా దసలు గుంటూరండి. మా నాన్నతో పోట్లాడి మా అమ్మ నెల్లూరెళ్ళిందండి. అక్కడ మా తాత ఉన్నాడండి. ఆర్నెల్లయింది. మా నాన్న ఉత్తరం రాసినా రాలేదండి. నే నెళ్ళి బతిమాలుకుంటానండి."

"మరి మీ నాన్నతో ఎందుకు చెప్పలేదు?"

"చెబితే ఒప్పుకోడండి. ఓసారి అడిగానండి. 'అమ్మకి నువ్వక్కర్లేక పోతే నీకు అమ్మెందుకురా గాడిదా' అని తిట్టాడండి. అందుకని చెప్పకుండా వచ్చానండి. ఇంకెప్పుడూ ఇలా చెయ్యనండి. ఈ సారికి నన్ను నెల్లూరు పంపించండి. మీకు దణ్ణంపెడతానండి."

రామచంద్ర మనసు కరిగింది.

"మీ నాన్న ఏంచేస్తుంటాడు?"

"పొలం పనండి."

"నువ్వేం చదువుతున్నావు?"

"అయిదండి."

"నువ్వు చెప్పేది నిజమేనా?"

"అమ్మతోడండి." కుర్రాడు నెత్తిమీద చెయ్యి పెట్టుకున్నాడు.

"సార్, ఈ కుర్రాడికి నెల్లూరుకి టికెట్టివ్వండి. నేను డబ్బిస్తాను." టికెట్ ఎగ్జామినర్ ఆశ్చర్యపోయాడు.

"వాడి మాటలు నమ్మకండి. రాస్కెల్స్, ఇలాగే అబద్ధాలు చెబుతారు. ఓ సారి పోలీసు లాఠీ రుచిచూస్తేగాని బుద్ధి రాదు."

"నేను అబద్ధం చెప్పటంలేదండి. మా అమ్మ రాకపోతే నేను అక్కడే ఉండి చదువుకొందామని పుస్తకాలు కూడా తెచ్చుకున్నానండి. ఇవిగో చూడండి." బల్లకింద పెట్టిన పుస్తకాలు తీసి చూపించాడు ఆ కుర్రాడు. రామచంద్రకి గుండె నీరయింది.

"పోన్లెండి, పాపం టిక్కెట్టివ్వండి."

"మీ ఇష్టం. నీ పేరు చెప్పు."

"నాగులండి."

టికెట్ ఎగ్జామినర్ రసీదు రాసిచ్చాడు. రామచంద్ర డబ్బు చెల్లించాడు. ఆ కుర్రాడు రెండు చేతులూ జోడించి "దణ్ణమండి" అన్నాడు. రామచంద్ర వాడి భుజంమీద చెయ్యివేసి "సరేలే కూర్చో" అన్నాడు. వాడు కళ్ళు తుడుచు

కుని బెర్తుల మధ్య సందు చేసుకుని కూర్చున్నాడు. "జేబులు జాగ్రత్త" వార్నింగిచ్చాడు వాడి దగ్గర కూర్చున్న షావుకారు.

"దేశంలో బైరాగి టిక్కెట్లు ఎక్కువయిపోయాయి." ఒక దేశభక్తుడు వ్యాఖ్యానించాడు.

"ఈ దేశంలో బైరాగులకేమండీ? కాషాయి గుడ్డలమీద మోజున్నవాళ్ళు బోలెడు మంది." అన్నాడు రామచంద్ర.

"నీలాంటి వాళ్ళుండగా ఎవరికీ మాత్రం ఏం కొదవలే నాయనా!" అన్నాడు బైరాగి చిరునవ్వుతో.

రామచంద్ర ముఖం ఎర్రబడింది. అది పొగడటమో, తెగడటమో అతనికి సరిగా తెలియలేదు. తర్వాతి స్టేషన్లో టి.టి.ఇ. దిగిపోయాడు. రెండు హాల్టింగ్ స్టేషన్లు దాటినా జనం కంపార్ట్‌మెంట్‌లో కిక్కిరిసే ఉన్నారు. బాపట్ల దాటి పరుగులు తీస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ దారి మరమ్మతులో ఉండటంవల్లో ఏమో వేగం తగ్గి మందమందంగా నడుస్తూ మళ్ళీ వేగం పుంజుకొంటున్నది.

"ఖబర్దార్. ఎక్కడివాళ్ళక్కడే నిలబడి చేతులెత్తండి. అరిచినా, కదిలినా గుండెల్లో కత్తులు దిగబడతయ్యి."

ఉలిక్కిపడి చూసి ప్రయాణీకులంతా భయభ్రాంతులై నోట మాటరాక నిలబడి చేతులెత్తారు. అరడజను మంది చేతుల్లో కత్తులూ కటార్లతో భీకరంగా వాళ్ళని సమీపిస్తున్నారు. ఎక్కడినించి వాళ్ళు అలా అకస్మాత్తుగా ఊడిపడ్డారో ఎవరికీ అర్థంకాలేదు,

"మేం దగ్గరికి రాగానే నగలూనట్రా, డబ్బూ, వాచీలు అన్నీ తీసి వెంటనే ఇచ్చెయ్యండి. ఎవ నా ఎదురుతిరిగారో ఫైసల్–"కత్తులుఝళిపిస్తూఅరిచాడువాళ్లో.

అ వెంటనే వాళ్ళు విచ్చుకత్తులతో ఒక్కొక్కరిని సమీపించి వసూళ్ళు ప్రారంభించారు. ఎవరూ ఏమీ మాట్లాడకుండా అంతా వాచీలు, నగలు, డబ్బు తీసి ఇవ్వసాగారు.

"ఊఁ తియ్యి వాచీ" రామచంద్రని దౌర్జన్యంగా జబ్బపుచ్చుకు లాగి అన్నాడొకడు. రామచంద్రకి రక్తం ఉడికిపోయింది. వాచి చెంపకాయ కొట్టాలనిపించింది. కాని అది వ్యర్థ ప్రయత్నం. ఇంత మందిని ఎవరూ తోడులేకుండా ఎదుర్కోలేడు. ఎవరూ ఎలాంటి ప్రతిఘటనకీ సన్నద్ధంగాలేరు. మాట్లాడకుండా వాచీ తీసి ఇచ్చాడు.

"డబ్బు."

జేబులు తడిమాడు అతడు. రామచంద్ర డబ్బు తీసి ఇచ్చాడు. ఆ దొంగలు దగ్గిరికొస్తుంటే అంతా గజగజలాడిపోతున్నారు.

"ఏయ్ బైరాగీ లే."

"బైరాగోడి దగ్గి రేముంటుందిరా. ఆడి నొదిలెయ్యి." ఇంకో దొంగ సలహా ఇచ్చాడు.

బైరాగి నిర్లిప్తంగా కూర్చుని జరిగేదంతా చూస్తున్నాడు.

"ఏయ్–ఆడోళ్ళు–తియ్యండినగలు–"

స్త్రీలంతా భయం భయంగా చప్పున వాళ్ళ సొమ్ములు తీసి ఇవ్వసాగారు.

"ఏయ్– పిల్లా,నీకు వేరే,చెప్పాలేంటి–తియ్యి గాజులు."

ఆ అమ్మాయి చేష్టలుదక్కి గుడ్లప్పగించి అలాగే చూస్తోంది.

"దిమ్మరపోయింది, పాపం" అనుకున్నాడు రామచంద్ర.

"నీకే చెప్పేది!"

దౌర్జన్యంగా చెయ్యిపట్టి లాగాడు. కెవ్వుమన్న కేక. రామచంద్ర ఒక్కక్షణం తన ఉనికి, తన బలం, తన రక్షణ అన్నీ మర్చిపోయాడు. ఏంచేశాడో అతనికే తెలీదు. దొంగ మాత్రం గిరగిర తిరిగి పడ్డాడు. కత్తి రామచంద్ర చేతిలోకి వచ్చింది. అతను ప్రళయ రుద్రుడిలా దొంగకి కనిపించాడు. కత్తి గుండెల్లో దిగబోతోంది. చప్పున లేచి అందిన బ్రీఫ్‌కేస్ అడ్డంపెట్టి గట్టిగా ఈల వేశాడు. మెరుపులా డోర్ దగ్గరికి చేరాడు. చెయిన్ లాగాడు. రైలు ఆగకుండానే ఆ దొంగలంతా చేజిక్కించుకున్న సొమ్ములతో, డబ్బుతో రైలుదిగి పరారయారు.

రామచంద్ర జబ్బమీద స్లాక్ చిరిగి నెత్తురు చిమ్ముతోంది. అందరికీ ఒక్కసారిగా తెలివి వచ్చినట్టయింది. కంపార్ట్‌మెంటంతా కేకలతో రోదనలతో ప్రతిధ్వనించసాగింది. రామచంద్ర చుట్టూ గుంపు గుమిగూడింది. అందరూ అతన్ని ప్రశంసిస్తున్నారు. అతను ఎవరో ఏమిటో వివరాలు అడిగి వాటిని అందరికీ సరఫరా చేస్తున్నారు. పేరు రామచంద్రట! ఎం. ఏ. ట! మద్రాసుకి ఇంటర్‌వ్యూకి వెడుతున్నాట్ట! అబ్బో, ఏం పౌరుషం, ఏం ధీమా, ఏం నేర్పు!

"బలే, ఏం దెబ్బ! గింగిరాలు తిరిగి పడ్డాడు. అంతే కావాలి." సంతోషంతో చప్పట్లూ కొట్టసాగాడు నాగులు.

"చచ్చినాడు, పెళ్ళికాని పిల్ల! చెయ్యిపట్టుకుంటాడా! బాగా బుద్ధి చెప్పావు నాయనా! నీ ఋణం వెయ్యి జన్మలెత్తినా తీర్చుకోలేం. పిల్ల బెంబేలెత్తిపోయింది. దేవుడల్లే అడ్డుపడ్డావు నాయనా– అమ్మో పెద్ద గాయమైందే." ఆ అమ్మాయి పక్కన కూర్చున్న నడివయసు స్త్రీ వాపోసాగింది.

"పరవాలేదండీ,"అన్నాడురామచంద్ర.

ఆ అమ్మాయి ఇంకా గజగజ వణికిపోతూనే రామచంద్రనీ, అతని గాయాన్నీ చూసింది. తెలివితేటలన్నీ చప్పున కమ్ముకున్నట్టయి ఆమె చొరవగా కుర్రవాడి వైపు చూస్తూ అంది.

"ఇదిగో నాగులూ, ఈ రుమాలు తడిపి గాయానికి కట్టు కడతావా!"

నాగులు వెంటనే ఆమె ఇచ్చిన రుమాలు తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళి తడిపి అతని చేతికి కట్టుకట్టాడు. రామచంద్ర ఇద్దరి వైపూ కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

"సెటిల్‌మెంట్ దొంగలే అయుంటారు" అన్నాడు ఎవరో.

"ఎవరైతే ఏం, మన ప్రాణానికి!" ఓ వృద్ధురాలు అంది.

రామచంద్రకి చప్పున తన బ్రీఫ్‌కేస్ సంగతి గుర్తుకొచ్చింది. చుట్టూ కలయ చూశాడు.

"ఏమిటి వెతుకుతున్నారు?"

"నా బ్రీఫ్‌కేసండీ."

"ఇంకెక్కడి బ్రీఫ్‌కేస్! మీ చేతిలో కత్తి చూసి ఎక్కడ పొడిచేస్తారోనని ఆ బ్రీఫ్‌కేస్ అడ్డంపెట్టుకుని పారిపోయాడు వాడు." ఓ ప్రత్యక్ష సాక్షి కథనం.

రామచంద్రకి పై ప్రాణాలు పైనే పోయాయి. అందులో తన క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ల ఒరిజినల్స్ అన్నీ ఉన్నాయి. అతనికి ముచ్చెమటలు పట్టాయి. తనని ఇంటర్వ్యూకి డిస్‌క్వాలిఫై చేసేస్తారు. చేతికి చిక్కిందనుకొన్న ఉద్యోగం రెక్కలొచ్చిన పావురంలా ఎగిరిపోతోంది. రామచంద్ర మనసు మనసులో లేదు.

"నా సర్టిఫికేట్లన్నీ అందులో ఉన్నాయండీ" అప్రయత్నంగా అన్నాడు.

"అయ్యో!" అంతా జాలిగా చూశారు.

బైరాగి కలగచేసుకుని అన్నాడు.

"విచారించకు నాయనా. వాటన్నిటకంటె విలువైన సర్టిఫికెట్ దేవుడు నీకిచ్చాడు."

రామచంద్రకి ఒళ్ళు మండింది.

"ఏ దేవుడండీ? ఎక్కడున్నాడు అతగాడు! అమాయకులైన ప్రజల్ని దొంగలు బందిపోటు చేస్తుంటే కిమ్మనకుండా ఏ లోకంలోకో జారుకొనే దేవుడిచ్చే దొంగ సర్టిఫికెట్లు ఈ లోకంలో చెల్లవు. అతడు నాకేమీ ఇవ్వనవసరం లేదు. మీకు దేవుడు కనిపిస్తే ఆ మాట చెప్పండి."

బైరాగి కోపం తెచ్చుకోలేదు.

"ఆవేశపడకు బాబూ. వెన్నెముక గల ధీరుడివి. ధార్మికుడివి. శక్తి సంచాలనం జరుగుతున్నది. శక్తి సూక్ష్మ రూపిణి. జగన్మోహిని. కాలకుండలి జాగృతమై షట్చక్రాలు ఛేదించి సహస్రారంలో శివసాయుజ్యం చెంది నీ జన్మ సార్థకమవుతుంది. ఆ వెలుగులో సమస్తమూ నీకు తెలిసిపోతుంది." మృదువుగా అన్నాడు బైరాగి.

"స్వామీ ఆ తారకమంత్రం మాకు ఉపదేశించండి. మేమూ తరిస్తాం" అన్నారు అక్కడ చేరిన జనం చేతులు జోడిస్తూ.

బైరాగి నవ్వాడు.

"అది తారకమంత్రం కాదు. జీవిత విధానం."

"అంటే?" అంతా అడిగారు.

బైరాగి మాట్లాడలేదు. రామచంద్రకి అసహనం పెరిగింది.

"అసలీ జీవితానికి అర్థమంటూ ఉందా? పుడతాం, బతుకుతాం, చస్తాము– అంతే కద!"

"అనుభవాలన్నీ ఆలోచనల కందక పోవచ్చు గదా! అదీకాక ఆలోచనలు రకరకాలు. కనిపించేదీ వినిపించేదీ ప్రణవం అని నేనంటే, కాదు ప్రళయం అని నువ్వు అనొచ్చు. మరొకరు ప్రళయం అనొచ్చు. ఇక్కడ నేను ప్రళయమూ చూశాను, ప్రణవమూ విన్నాను. ప్రణయం సంగతి అడగొద్దు" బైరాగి మందహాసం చేస్తూ రామచంద్ర వైపూ, అతని వైపు అనిమేషంగా చూసే ఆ అమ్మాయి వైపూ చూస్తూ అన్నాడు. ఆ అమ్మాయి తళుక్కున బైరాగి వైపు చూసి చూపులు నేలవైపు మళ్ళించింది. రామచంద్రకి బైరాగి మాటలు బోధపడలేదు.

"గార్డు వస్తున్నాడు" అన్నాడువెవరో.

గార్డు కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించగానే అందరూ గొల్లుమంటూ జరిగింది చెప్పారు. అంతా విని "చీరాల స్టేషన్లో కంప్లెయింట్ ఇద్దాం" అనిగార్డు దిగి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అంతా మౌనంగానే గడిపారు. చీరాల్లో కంప్లెయింట్ ఇవ్వటమైంది. రామచంద్ర గాయానికి ప్రథమ చికిత్స చేశారు.

ఎక్స్‌ప్రెస్ మళ్ళీ కదిలింది. వేగం అందుకుంటున్నది.

బెర్త్ మీద కూర్చుని వెనక్కి జేరగిలబడ్డాడు రామచంద్ర. అతని మనసులో నిరాశ గూడుకట్టుకుని ఉంది. ఎందుకిలా జరిగింది? తను స్లీపర్ కోచ్‌లోనే ఉంటే ఈ అవస్థ ప్రాప్తించేది కాదు. ఒక మంచి పనికి ఇది ప్రతిఫలమా? పోనీ, ఆ దొంగతో కలియబడకుండా ఉన్నా తన సర్టిఫికెట్లు దక్కేవే. ఏదో శక్తి తనని ఆవహించింది. అదే తనని నడిపించింది. మేజోళ్ళో కొంత డబ్బు దాచాడు. అదొక అలవాటయింది. మద్రాస్‌లో ఖర్చులకి తిరుగు ప్రయాణానికి సరిపోవచ్చు. కాని మద్రాస్ వెళ్ళటం ఎందుకు? స్పష్టంగా నియమాల్లో పేర్కొన్నారు. సర్టిఫికెట్లు లేనిదే ఇంటర్వ్యూకి అర్హతలేదు...రామచంద్ర నిట్టూర్చాడు. ఇంకా తనెందుకు ప్రయాణం చేస్తున్నాడు? టికెట్ ఉందనా! ఏదో తెలియని ఆశ ఏ మూలో ఉండి మాగ్నెట్‌లా ముందుకి లాగుతోందా? ఈ ప్రయాణం నిజంగా అర్థరహితమైంది కాదా? కాకపోతే ఇందులో అర్థమేమిటి? బైరాగి మాటల్లో భావం ఏమిటి? పదాడంబరమేనా? అంతేనా? తనూ ఒకనాడు ఆ బైరాగి లాగే– ఉలిక్కిపడ్డాడు రామచంద్ర. బైరాగి వైపు అప్రయత్నంగా చూశాడు. బైరాగి నిర్లిప్తంగా కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్నాడు. రామచంద్రకి ఏదో ధ్వని వింత వింతగా వినిపిస్తోంది–

అది ప్రళయమా, ప్రణయమా, ప్రణవమా! ఏదేదో అనుభవాలు వెన్నంటుతున్నట్టు ఏదో అనుభూతి కలుగుతోంది.

రైలు వేగంగా పోతోంది.

రామచంద్ర ప్రయాణం చేస్తున్నాడు.

అర్థంతెలియని శబ్దం ఏదో అతనికి వినిపిస్తూనే ఉంది.

అతను ఆలోచిస్తూనే ఉన్నాడు– ఈ ప్రయాణం– ఈ ప్రయాణం అర్థరహితమేనా?

———